**ఆకస్మికంగా ఆ సిటీలో కలకలం చెలరేగింది. మళ్ళీ గొడవలు మొదలయ్యాయిట. ఎవరినో ఆ ప్రక్క బజారులో పొడిచేరట అని జనం చెప్తుకుంటున్నారు.**

కర్ఫ్యూ పెట్టేసేరు. పదండి–పదండి. జనం కకావికలై పరుగులెత్తుతున్నారు.

ఇరవై నాలుగు గంటలూ రద్దీగా వుంటుంది ఆ రోడ్డు. ఆ రోడ్డు ప్రక్కన విస్తారంగా ఎదిగి నీడని అందించే ఓ చెట్టు క్రింద కూర్చుని వున్నాడు ఫకీరు బాబా. అతనికి కళ్ళు కనిపించవు. పుట్టు గ్రుడ్డివాడు. అతని ప్రక్కనే కూర్చుని భిక్షం అడుక్కుంటాడు కుంటి యాదయ్య. అతనికి రైలు ప్రమాదంలో ఒక కాలు పోయింది.

"ఏంది యాదయ్యా?... ఏమయ్యింది?... ఏదో పరేషాన్ అవుతున్నవు...?" అడిగేడు ఫకీరు బాబా.

"కర్ఫ్యూ అంట. అంత ఉరికి పోతున్నరు. దుకాణాలు గూడా బందు చేసేస్తున్నరు" చెప్పేడు యాదయ్య.

"అయితే మనం?..." అర్థోక్తిగా ఆగేడు ఫకీరు. వారిద్దరి బ్రతుకూ, బ్రతుకుతెరువూ ఆ చెట్టు నీడనే జరిగిపోతుంది. అది విడిచి ఎటు పోవాలి?

ఇల్లు, వాకిలీ లేక, రోడ్డు మీదే బ్రతుకుతున్నవారు ఆ కర్ఫ్యూ నుంచీ తప్పించుకోవటానికీ, తమని తాము రక్షించుకోవటానికీ ఏం చేయాలి?

"ఒరేయ్!... మీరేందిరా ఇంకా ఈడనే కూచున్నరు. నడవండి... నడవండి" ఒక పోలీస్ కానిస్టేబుల్ తన చేతిలోని లాఠీ తాటిస్తూ బెదిరించేడు.

"యాడికి బోవాలె సార్?... మేముండేది గీ రోడ్డు మీదనే." అన్నాడు యాదయ్య.

"యాడికన్న పో!... ఛీ!... ముందీడ నుండి లెగు..." కఠినంగా జవాబిచ్చేడు పోలీసు.

"పద బాబా!... ఈడ నుంచి గల్లీ గల్లీలకి బోదాము" అంటూ లేచి తన చేతి కర్రలు అందుకున్నాడు యాదయ్య.

యాదయ్య చంకల్లో రెండు కర్రలు తాటించి వాటి ఆధారంగా నడుస్తున్నాడు. ఫకీరు బాబా ఆ కర్రల శబ్దాన్ని అనుసరిస్తూ కదిలేడు.

యాదయ్య సందులు గొందులు తిరిగి ఒక చోట ఆగేడు. అది మూడంతస్తుల అపార్ట్‌మెంట్. దాని క్రింద పిల్లర్ల మధ్య స్థలం ఖాళీగా వుంది. ఆ స్థలాన్ని కార్లు, స్కూటర్లు పెట్టుకోవడానికి వదిలేసేరు.

యాదయ్య ఆ గేటులోని కెళ్ళి బిల్డింగ్ వెనగ్గా చాటున ఎవరికీ కనపడకుండా ఒదిగి కూచున్నాడు. అతని ప్రక్కనే బాబాకు చోటు ఇచ్చాడు.

చూస్తుండగానే అంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా మారిపోయింది. ఆ అపార్టుమెంట్లోని వాళ్ళు గూట్లోకి ఎగిరి వచ్చే పక్షుల్లా ఒకరొకరూ చీకటి పడక మునుపే తమ ఫ్లాట్ల లోకి చేరుకున్నారు.

ఆ రాత్రి గడిచింది. మరునాడు కర్ఫ్యూ పొడిగించేరు. ఆ అపార్టుమెంట్‌లోంచి బయటి పనులకి వెళ్ళాల్సిన వారంతా తమ తమ నెలవుల్లో బందీలయిపోయేరు. అందరూ ఇండ్లల్లోనే వుండడంతో సందడిగా వుంది.


అయాచితంగా వచ్చిన సెలవు రోజును అంతా తోచిన విధంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

ఒక ప్రక్కన ఫ్లాట్లోంచి నవ్వులూ, కేరింతలూ, ఆటలూ పాటలూ విని పిస్తున్నాయి. మరోచోట జోరుగా పేకాట సాగుతోంది.

కొంతమంది ఒకచోట చేరి పెద్దగా లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.


అందరి మధ్యా వున్నది ప్రస్తుత సమస్య. మనిషి మనిషి మధ్య కుల మతాల పేరిట పేరుకున్న వైషమ్యాల గురించి రెండు పార్టీలుగా విడిపోయి వాదించుకుంటున్నారు.

పశువుల్లో పిల్లి, కుక్క, నక్క అంటూ వేర్వేరు జాతులున్నాయి. అవి పరస్పరం కలహించుకున్నాయంటే అర్థం వుంది. కాని మనిషి జాతి ఒక్కటే. అయినా వారు అనాదిగా పరస్పరం కలహించుకుంటూనే వున్నారు. ఒకరిని ఒకరు ద్వేషించుకుంటున్నారు... భూమిని పంచు



# బలిదానం

## సాకేతపురి కస్తూరి



కోవాలని చూస్తున్నారు. భూమాతని ముక్కలు ముక్కలు క్రింద వరికేయాలని చూస్తున్నారు. తమ మనసులను ముక్కలు ముక్కలుగా విభజించి, వాటికి పార్టీలని పేర్లు పెడుతున్నారు.

వాళ్ళ అరువులు చర్చలూ అర్థం కాని ఫకీరు బాబా "ఏంది యాదయ్యా! గా గలాటా? (గోల)" అని అడిగేడు.

"ఏం లేదు. పని లేక బాగా తిని కొవ్వెక్కి కొట్లాడుకుంటున్నారు" రెండు రోజుల నుండీ తిండి లేక ఆకలితో కడుపు మండిపోతుండగా కసిగా అన్నాడు యాదయ్య.

"ఎవరు?..." అడిగేడు బాబా.

ఎవరని చెప్పగలడు యాదయ్య, కళ్ళులేని బాబాకి తెలిసింది రెండే రెండు పార్టీలు. ఒకడు వున్నవాడు, మరిఒకడు లేనివాడు. ఉన్నవాడు దయతలచి అతనికి ధర్మం చేస్తే గతిలేని బాబా పొట్టని దానితో నింపుకుంటాడు.

సంధ్య దాటింది. అమావాస్య చీకటి అలముకుంటున్నది. కళ్ళు తెరిచినా, మూసినా అంధకార బంధురమే ఫకీరుకు. అతని జీవితంలో వెలుగు ప్రసరించటమంటే ఆకలి తీరటమే. అది తీరే మార్గం లేదు. ఇక ఆకలికి తట్టుకోలేకపోయేడు బాబా.

"యాదయ్యా గీడేడగింత చాయ్

బండన్న లేదా?..." అడిగేడు.

"లేదు బాబా..." అన్నాడు యాదయ్య. యాదయ్యకీ కసిగా వుంది. కోపంగా వుంది. ఎన్నాళ్ళుంటదింక గీ కర్ఫ్యూ!... గప్పటి దాక తిండి లేకుండ సచ్చిపోయేటట్టున్నము" అనుకున్నాడు.

యాదయ్య లేచి "బాబా నీవు గీడనే కూసో! నేను ఏమన్న తిననీకి అడుక్కొస్తను" అని చెప్పి నెమ్మదిగా కుంటుకుంటూ అపార్ట్‌మెంట్ ముందుకి వెళ్ళేడు.

"అమ్మా!... ఆకలి. రెండు దినాల సంది అన్నం లేదు. అమ్మా!... కుంటోడిని... అన్నం పెట్టు తల్లీ!..." తల పైకెత్తి గొంతు చించుకుని అరవసాగేడు యాదయ్య.

ఆ అరుపులు విన్నవారు ఉలిక్కిపడ్డారు. ఎవరు? ఎవరది?... ఇంత రాత్రివేళ, ఈ కర్ఫ్యూలో ఎలా వచ్చేడు? అని ఆశ్చర్యపడ్డారు. ఎవరో క్రిందకి వెళ్ళి చూడబోయేరు.

మరొకరు "అరె... కిందకి వెళ్ళకండి. వాడి చేతిలో కత్తి వుండవచ్చు" ముందు జాగ్రత్తతో వారించారు.

"అవునండీ!... ఎక్కడో ఇలాగే జరిగిందట. బిచ్చగాడని దయతలచి అన్నం పెట్టాలని దగ్గరికెళ్ళగానే గుడ్డచాటున దాచిన కత్తి తీసుకుని పొడిచి పారిపోయేడట" ఓ కాబోయే రచయిత కథ చెప్పేడు.

"అవునా?... నిజంగా రోజులు బాగోలేవండి. ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మగూడదో తెలియడం లేదు" కట్టుకున్న భార్యని, కన్న పిల్లలనీ కూడా నమ్మలేని– ఒక అనుమానస్తుడు సెలవిచ్చాడు.

"అయినా వాడు లోనికి ఎలా వచ్చాడు? వాచ్‌మన్?... వాచ్‌మన్ ఏడీ!..." అంతా వాచ్‌మన్ కోసం చూసేరు.

వాచ్‌మన్ వచ్చాడు.

"ఎలా వచ్చాడు వాడు? ఏం చేస్తున్నావు నీవు?" అంటూ వాచ్‌మన్‌మీద విరుచుకుని పడ్డారు.

"అయ్యో ఎవరు సార్?... ఉండండి నేను చూస్తాను" వాచ్‌మన్ సుడిగాలిలా క్రిందకి దిగి వచ్చేడు.

"ఎవర్రా?... ఎవరు మీరు? నడవండి బయటకు. ఇది మీ బాబుగాడి జాగా అనుకున్నారు భే...లెండి!... ఈడ నుండి" వారిని తరిమి తరిమి కొట్టేడు వాచ్‌మన్.

"యాదయ్య! యాడికి పోతున్నవు?" చీకట్లో తడుముకున్నాడు ఫకీరు బాబా.

"రా... ఈడ ఓ గుడి వున్నది. ఆడ పదిలంగుంటది" యాదయ్య దారి తీసేడు.

ఇద్దరూ గుడి అరుగుపైకి చేరుకున్నారు. మనిషికి ప్రాథమిక అవసరాలు – తినటానికి కాస్త తిండి, తల దాచుకోవటానికి కో గూడూ– కావాలి.

అవి రెండూ కరువైన కోట్ల మంది భారతీయులకి వారసులు వారిద్దరు. వారి కడుపులో పేగులు ఆకలితో మెలికలు తిరుగుతున్నాయి. కాలే కడుపుల్లోకి కాళ్ళు ముడుచుకుని పడుకున్నారు.

అర్థరాత్రి దాటింది. గుడిలో ఏదో సందడి. ఎవరో పరుగెత్తుతున్న పద ధ్వని. ఎవరివో గుసగుసలు. ఫకీరు బాబా అవి విని గబుక్కున లేచేడు. లేచి "యాదయ్యా! యాదయ్యా!..." అంటూ ఆందోళనగా పిలిచేడు.

"ఏంది బాబా?" అంటూ లేచేడు యాదయ్య.

"చూడు ఎవ్వరో!?... ఎవ్వరో వచ్చినట్టున్నరు" బాబా గుసగుసగా చెప్తుండగానే అటు చూసేడు యాదయ్య. గుడిలో బాంబు పెట్టి వైర్లు లాగుకుంటూ ప్రహరీ వెంట పోతున్నారు ముగ్గురు.

"బాబా! పద జల్ది ఈడ బాంబులు పెడ్తున్నరు..." అంటూనే లేచి కర్రలందుకున్నాడు యాదయ్య.

"యేడున్నవు యాదయ్యా?... తడుముకుంటూ గుడి వైపు పోబోయిన ఫకీరు బాబాని–

"ఇటు... ఇటురా... బాబా" అంటూ అతన్ని పిల్చుకుని గుడి దాటి బయటికి వచ్చేడు యాదయ్య. ఇద్దరూ గుడి ముందు నిలబడి ఎటు పోవాలో, తమ గమ్యమేదో తెలీక తచ్చాడుతున్నారు.

అంతలో దూరంగా వస్తున్న పోలీస్ జీప్ హెడ్ లైట్ల కాంతి ఇద్దరి మీదా పడింది.

"షూట్... షూట్ దెమ్" గాలిలో అరువు వినిపించింది.

"ఢామ్... ఢామ్" అన్న పిస్తోలు ప్రేలుడు. ఆ ఇద్దరి గుండెల్లోకి గుండ్లు దూసుకుని పోయేయి.

"యా!... అల్లా!..."

"హా!... రామా!..." అన్న మూలుగులు. తరువాత అంతా నిశ్శబ్దం.

టకటకమన్న బూట్ల శబ్దం. పోలీసులు గుడిలోకి వెళ్ళి అటూ ఇటూ చూసేరు. ఎవరూ కనిపించలేదు.

దూరంగా ఎక్కడో గోల వినిపించింది. పోలీసు జీపు అటు కదలిపోయింది. జీపు కనుమరుగవ్వటంతో ఎక్కడి నుంచో మరో గుంపు పరుగు పరుగున అక్కడికి వచ్చింది. వారంతా ఫకీరు బాబా, యాదయ్య శవాల మీద నుంచి దాటుతూ గుళ్ళోకి ఆతృతగా ఉరికారు. చాకచక్యంగా బాంబు ప్రేలకముందే దానిని తీసేసారు.

"బచ్.. గయా, వి సేవ్‌డ్ గాడ్" ఆనందంగా అరిచేరు.

అవును గుడిలోని రాతి విగ్రహాలని బాంబు ప్రేలుడులో చిన్నాభిన్నమవ్వకుండా రక్షించేరు.

తమ దేవుడిని, తమ మతాన్ని పరిరక్షించేరు.. తమ పార్టీ పరువును నిలబెట్టేరు.

కానీ ఒక్కటి మరిచేరు. ఈ విధ్వంస కాండని, ఈ మారణ హోమాన్ని చూస్తూన్న దేవుడు... మాధవ సేవ కన్న మానవసేవే గొప్పదని చెప్పిన మత గ్రంథాలూ, బాధతో కన్నీరు కారుస్తున్నాయని మనిషి మరచి పోయాడు. ●

## ★ ఆత్మకథకుడికి... ★

దుఃఖాన్ని గుండెతో కొలిచి ఎవరు తాగుతారు?
చిత్త ప్రవృత్తులు నవ్వనీ!
ఆ కరస్పర్శను స్పృశిస్తాను
వికట మబ్బులు ఏడ్చీఏడ్చీ
తడితడి బురద
చింపిరి నామాల కళ్ళు ముళ్ళు మొలచి అపహాస్యించనీ
ఆ తడి పాదాల్ని అద్దుకుంటాను
వెనక్కి వెనక్కిలాగే కేతిగాళ్ళు
విధ్వంసించనీ
విషాన్ని నింపనీ
ఆ నెత్తురొలికే నగ్న నరాల్ని అల్లుకుంటాను
ఆది కాలపు కోతి తుంచిన
శైశవపు అనంత మొగ్గలు
మండగా మండగా
ఆ ప్రజ్వలన ఆత్మకథ వెలుగులో
నా చిరునామా వెతుక్కుంటాను

– ఇక్బాల్ చంద్